
# పెద్దకథ:




సుశీల.

పక్షుల కిల కిలారావాల్తో పిల్ల తెమ్మెరలు సన్నగా ఊదే మలయమారుత రాగాల మధ్య, ఉభయ సంధ్యల్ని చూస్తూ కూర్చోవటమంటే నాకెంతో ఇష్టం. సంధ్యారుణ శోభను తిలకిస్తూ తన్మయత్వంలో తేలాడేదాన్ని. ఆ తన్మయత్వంలోనుంచి చటుక్కున నాలో ఓ ప్రశ్న జనించేది: ఉదయాస్తమయాల్లా మానవజీవితపథానికి గూడా ఓ క్రమగతి వుంటుందా అని...

సాగిపోయే కాలంతోబాటు సాగి ముందుకు నడచే జీవితాల్ని పరికిస్తే ఏ రెండు జీవితాలూ ఒకటిగా కనిపించవు. ఒకే పథంలో నడుస్తున్నట్లు తోచినా ఏ ఇద్దరి జీవితాలకూ పోలికలే లేవు. ఏ జీవితం సూటిగా నడచే బాటలాంటిది గాదు. ప్రతి జీవితంలో ఎన్నో వంపులు...ఎన్నో సంధ్యలు...ఎన్నెన్నో ఉదయాస్తమయాలు...

**సత్యం :**

సుశీల చెప్పింది నిజం; రోజుకు సంధ్యలు రెండే (మధ్యాహ్న సంధ్యతో కలుపుకొని మూడు) ... కాని జీవితంలో ఎన్నో సంధ్యలు ... ఎన్నో మలుపులు...ఆ సంధ్యల మలుపుల్లో చిక్కుకొని ఉక్కిరి బిక్కిరవటం నా కిష్టంలేదు. రోజులా జీవితాన్ని రెండు సంధ్యల మధ్యనే మలుచుకోవాలని, ఉభయ సంధ్యలమధ్య జీవితాన్ని ఓ సరళరేఖగా రూపొందించుకోవాలని నా ఆశయం. అదే నా కల, తీయటి కల...

ఓ రోజున, బీచ్‌లో సంధ్యారాగాన్ని తిలకిస్తున్న సుశీలను చూశాను; ఆమె ఎవరో కాదు, నా కాలేజ్ మేట్; అంతకుమించి నాన్నగారి ప్రాణస్నేహితుడి కుమార్తె. మా ఇద్దరిమధ్య పరిచయం పెరిగింది. తరచూ బీచ్‌లో కలుసుకునేవాళ్ళం. శని ఆదివారాలు వాళ్ళింట్లో బాతాఖానీకి కూర్చొనేవాళ్ళం. మా ఇద్దరి అభిరుచులూ చాలావరకూ ఒకటేనని గ్రహించాను. తరచూ సినిమాలు చూసేవాళ్ళం. నవలలు చదివి అభిప్రాయాలు

మార్చుకునేవాళ్ళం...

**సుశీల:**

సత్యం, నేనూ చాలా విషయాల్లో ఏకీభవించేవాళ్లం. రోజూ సాయంకాలం అతడు మా ఇంటికి వచ్చేవాడు. ఎప్పుడూ నవ్వుతూ వుండేవాడు. అందర్నీ నవ్విస్తుండేవాడు. అతడంటే ఇంట్లో అందరికి వల్లమాలిన అభిమానం యేర్పడింది. అతడు ఒకరోజు రాకపోతేసరి, మా ఇంట్లో అందరూ ఓ కుటుంబ సభ్యుడు తగ్గినట్లు వెలితి ఫీలయ్యేవాళ్లం. ఇక నా విషయమా, ఏమిటో మనసు బోసిగొట్టుతున్నట్లనిపించేది. దిగాలుగా కూర్చుండిపోయేదాన్ని. దిక్కులు చూస్తూ గడిపేదాన్ని. నా జీవితంలో సత్యం ఓ క్రొత్త మలుపు; ఒక నవోదయం; ఆ మలుపుకు ఆవలి జీవితం సూటిగా పయనించే రహదారిలా వుంటుందని, ఆ ఉదయం మరి అస్తమయమే లేనిదేనని ఏమేమో కలలు కనేదాన్ని.

**సత్యం:**

సుశీల హృదయంలో కలలు రేగాయని నాకు తెలుసు; అవును, ఆమెలో కలలు చిలికింది నేనే మరి. ఆ కలలరేవు పెళ్లనటంలో సందేహం లేదు. పెళ్లి చేసుకోవాలనుకుంటే ఆమెనే చేసుకోవాలనుకున్నాను. కాని నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు. పెళ్లి అనగానే మనస్సు భవిష్యత్తును గూర్చి పరి పరివిధాల ఆలోచించేది. పెళ్లి చేసుకుంటే నాలో మలుచుకున్న కలలు మంచు తెరల్లా కరగిపోతాయేమో అని సందేహం...

**సుశీల:**

పెళ్లి అనె మాట వినబడితే చాలు, సత్యం ఎందుకో మౌనం వహించేవాడు. నన్ను పెళ్ళి చేసుకోవటం అతడికి ఇష్టం లేదా! ఉహూఁ, అదేం కాదు, నేనంటే అతడికెంతో ఇష్టం. కథల్లోని నాయకుడిలా నా అందాన్ని వర్ణించకపోయినా, నన్ను పొగడ్తలతో ముంచెత్తకపోయినా, నన్నతడు ఎంతగానో ప్రేమిస్తున్నాడని నాకు తెలుసు మరింతగా ప్రేమించేవాడు పెళ్ళిచేసుకోటానికేం! అసలతడికి పెళ్లి చేసుకోవటమే ఇష్టంలేనట్టుంది. అతడ్ని వేధిస్తున్న సమస్య ఏంటో చెప్పేనా!...

**సత్యం:**

పెళ్ళనేది జీవితయాత్రలో ఓ మైలురాయి; మరుపలేని మలుపు; ఇద్దరి భవిష్యత్తు; సంతానోపనిషత్తు. అందుకే పెళ్ళంటే నూరేళ్ళపంటన్నారు...కాని...

**సుశీల:**

కానీల్ని, అయితేల్ని, కొత్తదనం లేని పాతనిర్వచనాలకు జోడించి ఏమేమో చెప్పటమేగాని, అసలు తన అభిప్రాయం యేంటో సత్యం బయటపెట్టడు. పెళ్ళంటే ఎందుకీమౌనం అని అడిగాను... మొదట పై చదువులు చదవాలని వుందన్నాడు. పూర్తైన తర్వాత సరైన ఉద్యోగం దొరకాలిగా అన్నాడు. ఉద్యోగం వచ్చినా పెళ్లి ఊసే యెత్తడు. ఈ విషయంగా అతడ్ని ఒత్తిడి చేయటానికి తల్లి తండ్రీ లేరు; చిన్ననాడే పోయారు; అయిన వాళ్ళు ఎవరైనావున్నా అతడు వారిని లెక్క చేయడు...

అతడి మౌనం నాలో పలురకాల సందేహాల్ని రేపింది. అతడ్ని సరిగా అర్థంచేసుకోలేకపోయానా...

**సత్యం:**

సుశీల ఆమధ్య ఎందుకో ఓ మాదిరిగా వుంటున్నది. నన్ను ఏమో అడగాలనుకుని అడగలేకపోతున్నదేమో అని నా అనుమానం...ఆరోజు సాయంకాలం బీచ్‌లో కూర్చుని వున్నాం; రోజూ ఏమేమో చెప్పకుపోతూవుండే ఆమె ఆరోజు ఎందుకో మూగనోముపట్టినట్లు మౌనంగా కూర్చుంది. భూమి గుండంగా వుందనటానికి నిదర్శనగా కనిపిస్తున్న నీలిఆకాశాలుకు దిగువున క్రుంగిపోతున్న సూర్యబింబాన్ని చూస్తూ ఏమో ఆలోచిస్తున్నది...

మాకు ఏకాంతాన్నివ్వటానికా అన్నట్లు బీచ్ నిర్జనంగా వుంది. అటునుంచి వినిపిస్తున్న సముద్రపుహోరు తప్ప మా ఇద్దరిమధ్య మౌనమనే నిశ్శబ్దం ఆవరించింది.

క్షణాలు...నిముషాలు గడుస్తున్నాయి...

'ఏమిటా పరధ్యానం సుశీ! నీ ఆలోచనల్ని నాకూ పంచిఇవ్వగూడదూ.' అంటూ మౌనాన్ని భగ్నం చేశాను.

**సుశీల:**

ఎలా అతడివద్ద ప్రస్తావన తీసుకురావటమా అని సతమతమౌతున్న నన్ను అతడు పలకరించటం ఓవిధంగా మంచిదే అయింది. కాని ఏం సమాధానం చెప్పాలో నాకు వెంటనే తోచలేదు. విరుచుకు పడుతున్న కెరటాన్ని చూస్తూ,

'మరేంలేదు సత్యం, విరుచుకుపడే కెరటాల్ని చూస్తుంటే, కేరింతల్తో గడచిన చిన్నారితనం గుర్తుకొస్తున్నది' అన్నాను.

'ఇంకా నయం, ఆ కెరటాల్తోపాటు అల్లరిచేయాలనిపిస్తున్నదనిగూడా అన్నావు గాదు' అన్నాడు సత్యం నవ్వుతూ.

అతడి మాటలకు నాకు నవ్వాగింది గాదు. నవ్వాపుకోటానికి ప్రయత్నించటంలో నాకు నువ్వు గింజంత సత్యం గోచరించినట్లయింది. 'ఆ కెరటాల్ని చూస్తుంటే జీవితానికి సముద్రానికీ ఎంతో పోలిక వున్నట్లు అనిపిస్తుంది గదూ...' అన్నాను.

సత్యం పెదవులమీద చిరునవ్వు తళుక్కుమంది.

'ఎందుకా నవ్వు...' అడిగాను అర్థంగాక.

'కోపం రాకపోతే చెప్తాను...' అన్నాడు సత్యం.

'అయితే చెప్పి తీరాల్సిందే; కనీసం నిజం చెప్పావన్న సంతృప్తి వుంటుంది...' అన్నాను.

'నే చెప్పాలనుకుంది నా మాటాగాదు, నీ మాటా గాదు. మరెవరో చెప్పినమాట; లోతుల్లో సముద్రం, స్త్రీహృదయం ఒకటే నంటారు; రెండూ అందనివే; అంతుచిక్కనివే...' చెప్పాడతడు

'బహుశా స్త్రీహృదయం తెలియని హృదయంలేని నీలాంటివాళ్ళెవరో అని వుంటారు...' అన్నాను, లోలోపల అతడికి సరైన సమాధానం చెప్పగల్గాననుకుంటూ.

'అంటే నాకు హృదయం లేదనా!' పాలిపోయిన ముఖాన్ని కప్పిపుచ్చుకోటానికి లేని నవ్వును తెచ్చిపెట్టుకుంటూ అడిగాడు సత్యం

'ఓహ్, నీకు హృదయంవుంది కదూ! పొరపాటైంది, ఏమీ అనుకోకు...' అన్నాను ఓదారుస్తున్నట్లు.

'అనుకోటానికేముంది సుశీ, నీమాటల గమ్యం అర్థమవుతూనే వుంది...' అన్నాడు సత్యం.

'అర్థమైతే సమాధానం చెప్పవేం సత్యం! సూటిగా అడగలేదనా! సరే అయితే, ఇంకా ఎంతకాలమని ఈ ఒంటరి జీవితం...' అడిగాను.

# జీవన సంధ్యలు

'నీకు తెలీదు సుశీ. జీవితంలో సెటిల్ గాందే పెళ్ళి చేసుకోవటంవలన ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవాల్సొస్తుంది...' సత్యం అనంతంలోకి చూస్తూ అన్నాడు; 'పెళ్ళైతే అనంతమైన సమస్యలొచ్చి పడేట్లు...'

'సెటిల్ అవటమంటె ఏంటో నాకు అర్థంగావటంలేదు సత్యం. సృష్టి జరిగి ఇన్నియుగాలైనా ప్రపంచమే సెటిల్ గాలేదు...' అన్నాను.

'అందుకే ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒకమూల అల్లకల్లోలం రేగుతూ వుంది; అశాంతి చెలరేగుతూ వుంది; స్థిరంలేని జీవితంగూడా అంతే...' నగ్నసత్యాన్ని చెప్తున్నట్లు అన్నాడు సత్యం.

'మనసు స్థిరమైనదైతే జీవితం దానం తటదే స్థిమిత పడుతుందంటారు. లోకంలోని అందరూ నీలా ఊహిస్తూ కూర్చుంటే అసలు పెళ్ళిళ్ళే జరగవేమో...' అన్నాను నిట్టూరుస్తూ.

'జరుగుతున్న పెళ్ళిళ్లలో ఎందరు సుఖపడుతున్నారు సుశీ! నిరాశ నిట్టూర్పులలో గడిపేవాళ్ళు, అసంతృప్తిని పైకి వెళ్లడించలేక లోలోపల క్రుగ్గేవాళ్ళు, కర్మ అనే మెట్ట వేదాంతంలో లేని తృప్తిని పటిస్తూ ఆత్మవంచన చేసుకునే వాళ్ళు...వీళ్ళే యెక్కువ...' సత్యం పెదవులనుంచి నిట్టూర్పు దిగజారింది.

'ఎడబాటుల్ని, విడాకుల్నిగూడా చేర్చ లేదేం...' లోలోపల నవ్వుకుంటూ అడిగాను.

సత్యానికి నవ్వాగింది కాదు; 'అల్వే అటువంటివాళ్లను, వ్రేళ్లమీదే లెక్కించ వచ్చు; ఇంకా మనసమాజం నాటికి అంతగా అలవాటు పడలేదుగా...' అన్నాడు.

'ఉహూ, బాగుంది పెళ్ళి అనే విషయంపై నీ పరిశోధన; కాని నేను అడిగింది ఎంతకాలం ఈ ఒంటరితన మని...' అడిగాను, ఈసారి సమాధానం చెప్పకుండా తప్పించుకోలే డనుకుంటూ ...

'నిజం చెప్పమంటావా!' అంటూ సత్యం నావైపు నిశితంగా చూశాడు. 'అయితే విను; ఈ ఒంటరి జీవితమే నా కెంతో హాయిగా వుంది సుశీ. నాగూర్చి నువ్వు, నీగూర్చి నేను నిరంతరం ఆలోచిస్తూ వుండొచ్చు...' అన్నాడు.

'పెళ్లయితే ఒకర్నిగూర్చి ఒకరం ఆలోచించుకోమనా నీ ఉద్దేశ్యం...' అడక్కుండా వుండలేక పోయాను.

'తీరిక యెక్కడుంటుంది సుశీ! ఇల్లు, పిల్లలు, సంసారం, బాధ్యతలు, ఈ తాపత్రయాల్లో లోకంలోని అనేకుల్లో మనమూ ఒకళ్లమైపోతాం; ఒకర్నిగూర్చి ఒకరం ఆలోచించుకునే వ్యవధిలేక సతమతమౌతూ అనామకులమే అవుతాం...' అన్నాడు సత్యం.

నాకు నవ్వాగిందిగాదు. 'అనామకులమైపోతామనే దిగులుతో అవివాహితులుగా వుండిపోవటం అవివేకమే అవుతుందేమో. అంతగా మన పై మనలో నమ్మకం లేనపుడు ముందుగానే తాజ్ మహల్‌లాంటి స్మృతిచిహ్నాన్ని నిర్మించుకుంటే సరి...' అన్నాను; ఆ చివరిమాటలు నాకు తెలీకుండానే అన్నాను; ఏమన్నానో తెలుసుకున్న తర్వాత షాజహాన్ చక్రవర్తుల పవిత్ర ప్రేమను కించపరచానేమో అని ఓ విధమైన బాధకు లోనయ్యాను.

సత్యం మాటలు ఆ బాధను మెలి తిప్పాయి. 'అవి చక్రవర్తులకు మాత్రమే చెల్లుతాయి సుశీ. చనిపోయినవారికోసం స్మృతి చిహ్నాల్ని నిర్మించగలరూ; చావక ముందే సమాధులూ కట్టుకోగలరు...అంటే చక్రవర్తుల ప్రణయానికి, సామాన్యుల ప్రేమకు వ్యత్యాసముంటుందని గాదు; ఆ మాటకొస్తే చక్రవర్తులకంటె సామాన్యుల ప్రేమ ఎంతో నిస్వార్థమైంది; పవిత్రమైంది; తాజ్‌మహల్ నిర్మాణ కథను తీసుకుంటే ఆ సత్యం వెల్లడవుతుంది...' అన్నాడు సత్యం నిట్టూర్పులు రాలుస్తూ.

అతడి నిట్టూర్పుల్లోనుంచి తాజ్ మహల్‌ను గూర్చి చెప్పుకునే ఓ కథ తళుక్కుమని మెరిసింది. బీదరికంలో కుమిలిపోతున్న ఓ మహాశిల్పి, ప్రియురాలికి పుట్టినరోజు కానుకగా ఇవ్వటానికి ఏమీ లేక, పాలరాయిలో ఓ బుల్లి బొమ్మరిల్లు మలచాడు. అది షాజహాన్ చక్రవర్తుల దృష్టిలో పడింది. భార్య ముంతాజ్ మహల్ స్మృతి చిహ్నాన్ని నిర్మించటంకోసం కళాఖండాలనదగిన ఎన్నెన్నో నమూనాలను పరిశీలించి తృప్తి లేకపోయిన చక్రవర్తుల మనసును ఆ పాలరాతి బొమ్మరిల్లు ఎంతగానో చూరగొంది. కాని ఆయనలో స్వార్థం ప్రబలింది; అటువంటి కళాఖండాన్ని సృష్టించిన శిల్పి అంతకుమించిన అపూర్వ కళాఖండాల్ని సృష్టించగలడనటంలో సందేహం లేదు. అప్పుడు ముంతాజ్ స్మృతి చిహ్నానికి విలువేం వుంటుంది! అందుకని, ఆ శిల్పి మరో శిల్పాన్ని సృష్టించకుండా చక్రవర్తి అతన్ని రహస్యంగా చంపించాడంటారు. ఈ కథే నిజమైతే షాజహాన్ చక్రవర్తిని ప్రపంచం క్షమించలేదనటం నిజం...

**సత్యం :**

తాజ్‌మహల్ కథ విని సుశీల మనసు పరిపరి ఆలోచనలకు గురైందని ఆమె ముఖమే చెప్తున్నది. మరి 'ముఖం మనసుకు అద్దం' అన్నారుగా. నిజంగా సుశీలను చూస్తూ కూర్చుంటే కాలం తెలియకుండానే గడచిపోతుంది. కాని కలుసుకుంటూ కూర్చుంటే పొద్దు గడుస్తుంది గాని జీవితం గడవదుగా అంది సుశీల! ఆ మాట అని 'ఎవరి పిచ్చి వాళ్లకానందంలే ...' అంటూ, 'వెళ్దాం ఇక ఇంటికి, ఇంకా ఎందుకు ఈ చల్లగాలిలో' అని లేవబోయింది.

కానంతలో మిత్రుడు రఘు మామూలుగా సాక్షాత్కరించాడు. వాణ్ని చూచి చాలా కాలమైంది; యూనివర్సిటీ వదిలినతర్వాత ఒకసారో రెండుసార్లో కలిశాం అంతే.

సుశీని చూసి, 'ఎవరు వదినగారేనా! పార్టీ ఇవ్వాల్సొస్తుందని పిలుపూ పేరంటం లేకుండానే గుట్టుగా పెళ్లి చేసుకున్నావన్న మాట.'. అన్నాడు రఘు.

'అసలు పేరంటం అనేది వుంటే నిన్ను పిలవకుండా జరుగుతుందా! జరిగినా పిలవకుండానే రాగలహక్కు నీకుందిగా.' అన్నాను.

'అయితే ఇంకా మారుకోతుల మఠంలోనే సీతంవేసు క్కూర్చున్నావన్నమాట...' అంటూ నవ్వాడు రఘు.

'పీఠాధిపతివి నువ్వు తప్పామంటేవిగా' అంటూ అతణ్ని సుశీకి పరిచయం చేశాను. హైస్కూలునుంచి యూనివర్సిటీ కాలేజీవరకూ ఇద్దరం ఒకే బెంచీ మీద కూర్చున్నాం.

'అంతేకాదండీ, ఒకే కంచానగూడా తిన్నాం...' అన్నాడు రఘు.

'అంటే మరేంలేదు, కారియర్ భోజనం ...' అన్నాను నేను నవ్వుతూ.

— 'ఓహ్, ఎంగిలైనా అనేదేవరు, ఇద్దరూ

ప్రాణస్నేహితులేగా...' అంది సుశీల.


'ఫ్రెండ్స్ విషయం ఏమైనా రేపు పెళ్లయితే ఎంగిలంటకుండా ఎలా గడు స్తుంది...' అంటూ ఛలోక్తి విసిరాడు

రఘు.

'ఒరేయ్ రఘూ, పెళ్లయి పిల్లలు పుట్టినా ఇంకా వాలంలేని వానరతత్వం పోనివ్వావుగాదు...' అన్నాను మందలిస్తు

స్నట్లు నటిస్తూ.

'లేకపోతే మరేంటోయ్, పెళ్లి విషయం అడుగుతుంటే ఇంకేమేవో చెప్తావేం...' అన్నాడు రఘు.



'ఆ ఊసుమాత్రం యెత్తకండి కాషాయాంబరాలు ధరించి జై పరమేశ్వరా అంటూ పారిపోగలడు...' సుశీల నావైపు చిలిపిగా చూస్తూ అంది.

'అయితే కొంచెం జాగ్రత్తగానే వుండాలి; పారిపోవటం జరిగితే మరి దొరకడు...' సుశీలను హెచ్చరిస్తున్నట్లు అన్నాడు రఘు.

'పెళ్ళికి భయపడి పారిపోయే పిరికివాణ్ణేం గాను, పట్టుకున్నా ర్ప్పోవాల్సిన బెడదేం లేదు. పదండి వెళ్దాం...' అన్నాను ఆ ప్రస్తావన మార్చాలని.

'ఎక్కడికి, పెళ్ళికా!' అడిగింది సుశి, కొంటెగా.

'ఫస్ట్ షో సినిమాకి'...చెప్పాను.

'అంతేగదా, సారీరా సత్యం, నేను రాత్రి మెయిల్లో తిరిగి వెళ్ళిపోవాలి, ఈలోగా కొంచెం షాపింగ్‌పని వుంది...' అన్నాడు రఘు.

అర్జంట్ పనిమీద ఉదయమే వచ్చాడట, పనైపోయి వెంటనే వెళ్ళక తప్పదన్నాడు. చాలాకాలం తర్వాత కలిసాం. ఆ రాత్రికి వుండిపొమ్మన్నా వినలేదు.

ముగ్గురం బీచ్‌నుంచి బయలుదేరాం. సుశీలను దార్లో ఇంటివద్ద విడచి, రఘుతో షాపింగ్‌కు వెళ్ళాను.

# జీవన సంధ్యలు

**సుశీల :**

ఆ రోజు తర్వాత చాలా రోజులవరకూ సత్యం కనిపించలేదు. ముఖం చాటు చేయటానికి కారణం యేమిటి ? రకరకాల సందేహాలు నాలో రేగాయి. అతడిమీద కోపంకూడా వచ్చింది. ఆ కోపంలోనుంచి ఉక్రోషం చెలరేగి ఏమేమిటో పిచ్చిపిచ్చి ఆలోచనలు మూగాయి. అసలు స్త్రీకి వివాహం దేనికి ? భర్తకు సేవచేయటానికి, పిల్లల్ని కనడానికేనా ! అంతలో నా ఆలోచనలకు నాకే నవ్వొచ్చింది.

బామ్మ వింటే మరేమైనా వుందా, "ఏమిటేవ్ ! చదివేస్తే వున్నమతి పోయినట్టు...' అంటుంది. సత్యం రానందుకు నాకంటే ఆమెకే ఆందోళన ఎక్కువగా వుంది. ఏమయ్యాడు ! ఇంటికి రావటం లేదేం ! పదేపదే అడగటం...

నాకు విసుగుపుట్టింది, 'ఏమయ్యాడో ఎవరికి తెలుసు, నాకేమైనా చెప్పి వెళ్ళాడా' అన్నాను చిరాకుతో.

ఏమనుకుందో ఏమో గదిలోకి వెళ్ళి గొణుక్కో సాగింది. ఆమె సణుగుడును భరించలేక పనికుర్రవాణ్ణి సత్యం వుంటున్న లాడ్జికి పంపాను. గదితాళం వేసి వుందట; వాకబుచేస్తే నాలుగైదు రోజులుగా గది తాళం వేసేవుందని, ఎక్కడకు వెళ్ళిందీ తెలీదని చెప్పారని చెప్పాడు వాడు. సత్యం మాట మాత్రమైనా చెప్పకుండా ఎటు వెళ్ళాడు! నిజంగానే జీవితంమీద విసుగుపుట్టి ఏ వైనా పారిపోయాడా ! కనీసం జాబైనా వ్రాసేవాడే; ఎందుకు వ్రాయలేదు ! నాలో కోపం పొంగింది; దుఃఖం చెలరేగింది. డాబామీద కూర్చొని సూర్యాస్తమయాన్ని చూస్తూ మనసుకు ఊరట చేకూర్చుకుందా మనుకున్నాను. అస్తమయ సూర్యుని చూస్తుంటే జీవితం ఏదో కొత్తమలుపుకు తిరుగుతున్నట్లనిపించింది. ఏమిటో ఆ మలుపు !...

**సత్యం :**


గ్రామంలో, పసిడిపొలాలకు అవల, నేల నింగి కౌగిలిలో కరగిపోతున్నట్లనిపిస్తున్నట్లు భ్రాంతిని కల్గిస్తున్న తావున క్రిందకు జారిపోతున్న సూర్య బింబాన్ని చూస్తూ కూర్చున్నాను. జీవితం ఎందుకో క్రొత్త మలుపులకు మళ్ళినట్లనిపించింది. సంధ్యారుణ రాగం వెదజల్లే అరుణిమతో ప్రకృతి సంపూర్ణతను పుంజుకున్నట్లు మనసు పులకలకు లోనైంది. కాని ఆ పులకల్లో ఏదో వెలితి...సుశీల గుర్తుకొచ్చింది.

రఘు బలవంతం చేయటంవలన అతడితోబాటు మెయిల్ యెక్కాను. సుశీలకు చెప్పిరావటానికి వ్యవధి లేకపోయింది.

'ఇంతలోనే ఏమనుకుంటుందిలే, శని ఆదివారాలు పల్లెలో గడపి సోమవారం ఉదయం తిరిగి చేరుకుంటావుగా...' అన్నాడు రఘు. కాదనలేక పోయాను...

పల్లెలో రెండురోజులు రెండుక్షణాల్లా గడచిపోయాయి. రఘు నన్ను వదలలేదు. అతడేగాదు, ముచ్చటగా వున్న అతడి ఇల్లూ కుటుంబం, పల్లె వాతావరణం నన్ను కదలకుండా చేశాయి. రఘును అతడి భార్యను చూస్తుంటే ఒకరికోసం ఒకరు పుట్టారా ! అనిపించింది. తోడు రత్నాల్లాంటి ఇద్దరుపిల్లలు... పెళ్ళిచేసుకోవటంలో ఆనందమేంటో నాకప్పుడు బోధపడింది...

పెళ్ళనేది జీవితానికి నిండుతనాన్ని చేకూరుస్తుందనటం నిజం. స్థిరమైన ఉద్యోగం, బ్యాంకు ఎకౌంటు, హాయిగా తిరగటానికి మోటారుకారు, ఇవన్ని




వుంటేనేగాని పెళ్ళి చేసుకోగూడదనుకునే నేను, ఇవేమీ లేకుండా పల్లెపట్టులో హాయిగా, సుఖంగా జీవిస్తున్న రఘువును చూసి అంతకాలం జీవితాన్ని వృథాచేశా ననుకున్నాను. సుశిగూడా వచ్చివుంటే ఎంత బాగుండేది.

చెప్పకుండా వచ్చినందుకు ఏమను కుంటుందో! పారిపోయాననుకుంటుందా! విరాగినై బైరాగి టిక్కెట్ పుచ్చుకున్నా ననుకుంటుందా...మనసు పట్నంపైకి మళ్ళింది. సుశీల ముఖారవిందాలని చెప్పాలని...అంతకుమించి ఇంకా ఏమేమో చెప్పుకోవాలని...

రఘుతో చెప్పి బయలు దేరాను...

(ముగింపు పైవారం)



పెద్దకథ:

# జీవన సంధ్యలు
(మలుపులు)




**శ్రీరామచంద్**

(గత సంచిక తరువాయి)

స్టేషన్‌కొచ్చి రైలుబండి యెక్కాను. ఏమిటో గ్రామంలో పట్టుకుని పది రోజులు గూడా కాలేదు, స్వగ్రామాన్ని స్వజనుల్ని వదిలి వెళ్తున్నట్లు హృదయం బరువెక్కింది. అయితే ఏదో చిక్కు వీడని సమస్య ముడి వీడిపోయినట్లు మనసు తేలికైంది. సుశీలను చూసి ఎన్నో నాళ్ళయినట్లు—ఆమెను చూడాలని తహతహ; నా నిర్ణయాన్ని ఆమెకు తెలిపి ఆశ్చర్య పరచాలని, ఆమె కన్నుల్లో వీచే ఆనందరేఖల్ని చూడాలని ఆకాంక్ష...

భవిష్యత్తును గూర్చిన తీయతీయటి ఊహల్లో మధ్యమధ్య తొంగిచూచే మధురమైన స్మృతుల్లో తేలిపోతూ ప్రయాణం సాగిపోయింది.

రైలుబండి స్టేషన్‌లో ఆగింది. క్రిందకు దిగి ఆశ్చర్యపోయాను.

మనసు ఉరకలు పెడ్తుండగా సుశీలను చూడాలని పరుగులుతీసే ఆ రైల్లో వచ్చాను. తీరా నేను బండిదిగేసరికి ఆమె బండి యెక్కటానికి ప్లాట్‌ఫారంమీద నిలబడివుంది. ఆమె చేతిలో సూట్‌కేసు వుంది.

ఆశ్చర్యంలోనుంచి తేరుకొని ఒక్క అంగలో ఆమెను చేరుకున్నాను, సుశీ అని పిలుస్తూ, ప్లాట్‌ఫారంమీద మసలుతున్న జనం, రైలుబండి కిటికీల్లో నుంచి చూస్తున్న తలలు ఏమనుకుంటాయో అనిగూడా లేకుండా!'...

'ఎక్కడికి ఈ ప్రయాణం...' అడిగాను, ఆశ్చర్యంలోనుంచి తేరుకుని.

'అడగటం భావ్యం కాదేమో...' అంది సుశీ తన ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నిస్తూ; మాయని నవ్వుతో మిలమిల లాడుతుండే ఆమె కన్నుల్లో పూర్వపు కాంతి లేదు.

'చెప్పి వెళ్ళలేదనా! అందుకే క్షమాపణ చెప్పుకోటానికి వచ్చాను...' అన్నాను,

ఆహాకా నా మీద కోపంతో ఆ సమాధానం ఇచ్చిందేమో అని.

'సమయం మించిపోయింది సత్యం...' అందామె; తల వంచుకొని.

ఆమె ఏమి మాట్లాడుతుందో అర్థం గాలేదు; 'నా నిర్ణయాన్ని వినకుండానే...' అప్రయత్నంగా అడిగాను.

'నిర్ణయాలు జరిగిపోయాయి...' అంది సుశీ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తూ చెప్పలేక.

లేని నవ్వును తెచ్చిపెట్టుకోవటం నావంతైంది. 'నిర్ణయాలు జరిగినా అమలు జరిగేలోగా మారిపోవటం లోకసహజం, మనసులు మారితే నిర్ణయాలు మారుతాయి; మరేవో నిశ్చయాలు జరుగుతాయి' అన్నాను.

నిజమన్నట్లు రైలు ఇంజన్ కూత వేసింది.

'తీరిగ్గా మాట్లాడుకోటానికి వ్యవధి లేదు; అవతల బండి బయలుదేరే టైమైంది...' అంది సుశీ. ఇంజన్ దిక్కుగా చూస్తూ.

'నే చెప్పింది విని, అంతగా అవసరమైతే మరో బండిలో వెళ్లవచ్చు...' అన్నాను.

'ఈ జీవితానికిదొక్కటే రైలుబండి సత్యం; ఈ బండి తప్పిందో నా జీవితం మరే మలుపుకు తిరుగుతుందో యేమో!' అంది సుశీ లోలోపల ఏందుకో మధన పడుతూ.

'నీ బాధేమిటో నాకు అర్థం గాకుండా వుంది సుశీ; నన్ను చెప్పనివ్వవు, నువ్వు చెప్పవు; నీళ్లలో ప్రతిబింబించే ఆకాశాన్ని చూచి అందని లోతులనుకున్నట్లుంది నీ భయం...' అన్నాను.

'ఒకవ్వాడైతే నీ అభిప్రాయాలకు ఇదే సమాధానం చెప్పేదాన్ని సత్యం...' అందామె నిట్టూరుస్తూ.

'ఇవాళ చెప్పలేనంటావు; అయినా ఇవాళ్టి నా అభిప్రాయాలను వింటే అభినందించకుండా వుండలేవంటాను. అసలు ఈ నిట్టూర్పులు, నిరాశతోగూడిన దైన్యం ఎందుకు! ఏమైంది?' అడిగాను.

'ఆడదై పుట్టితే ఏమౌతుందో అదే అయింది. స్త్రీ స్వాతంత్ర్యం... సమాన హక్కులు...ఇవి పెట్టిపుట్టిన ఏ ఒకరిద్దరికోగాని అందరికీ వర్తించవు. స్త్రీ ఎంత ఎదువుకున్నా...ఓ ఇంటిదైతే గాని సమా

# జీవన సంధ్యలు

జంలో గౌరవం పొందలేదు...' అంది సుశీ.

'ఇదేం కొత్త కాదుగా...' అన్నాను.

'పాత కథే మరి; ఇంట్లో ఎదిగిన పిల్ల వుండగానే ఇరుగు పొరుగులు చెవులు కొరుక్కోటానికి, ఇంటికి వచ్చేవాళ్ళు ప్రశ్నించటానికి మరో విషయం అక్కర లేదు; ఈ మధ్య మా ఇంటికి వచ్చే బంధు మిత్రులకు పెళ్ళికొడుకుల ముచ్చట్లు తప్ప మరో ధ్యాసే లేదు. నువ్వు కనిపించక పోవటంతో మా బామ్మకు మతి చెడినట్లయింది. ఏదో ఒక సంబంధాన్ని నిశ్చయించి మూడు ముళ్లు వేయించాలని పోరు సాగించింది. ఇంకా వివరంగా చెప్పాలా...' అంది సుశీ నా ముఖంలోకి చూస్తూ.

'అందుకని...' గాభరాగా అడిగాను, ఏదైనా అఘాయిత్యం చేయబోతున్నదేమో అని.

'ఆత్మహత్యకు పాల్పడే పిరికిదాన్ని గను ...అది కేవలం ఆత్మవంచనే అవుతుంది...' అందామె కొంచెం కంఠాన్ని హెచ్చిస్తూ.

'మరి పారిపోతున్నావా...' అనుకోకుండా అడిగాను; తీరా అడిగింతర్వాత ఆమె నన్ను అపార్థం చేసుకుంటుందేమో అనుకున్నాను.

'అబ్బే, లోకంలో ఓ వ్యక్తిగా బ్రతకటానికి బయలుదేరాను...' అందామె నేలవంగా నవ్వుతూ...

'అంటే...' అర్థంగాక అడిగాను.

'స్వతంత్రంగా జీవించాలని ... తప్పేం లేదుగా...' అందామె, అందుకు కావలసిన చదువు వుందనే ధైర్యంతో.

రైలు ఇంజన్ బయలుదేరబోతున్నట్లు మళ్లీ కూత వేసింది...

సుశీల ఉలికిపడి, 'టైమైంది సత్యం; మరి వస్తాను...' అంటూ పోబోయింది.

'వెళ్ళాల్సింది అటు గాదు సుశీ, ఇటు; నువ్వు చెప్పటం అయిందిగా, ఇక నే చెప్పేది వినటం నీ ధర్మం; ప్లీజ్...' అంటూ, పోబోతున్న ఆమెను వారించటానికి అప్రయత్నంగా చేయి పట్టుకున్నాను.

సుశీల గాభరాతో చేయి వెనక్కు లాక్కోబోయింది; 'సత్యం!' అని మందలిస్తున్నట్లు అంటూ.

'ఎక్స్‌క్యూజ్ మీ; చేయి పట్టుకున్నానేనా! కరగ్రహణమే కళ్యాణమహోత్సవం అన్నారు పెద్దలు...' అన్నాను...

నిజమో, కలో తెలియని సందిగ్ధంలో పడి సుశీ మౌనం వహించింది.

'నిజం సుశీ; ఆ నిశ్చయంతోటే వచ్చాను...' అంటూ ఆమె చేతిని గోముగా నిమిరాను.

సుశీల తేరుకుని, 'అయితే అదృష్టవంతురాల్నే' అంటూ సిగ్గుతో నా చేతుల్లోనుంచి తన చేతిని విడిపించుకుంది. ఆమె కళ్లు మిల మిలా మెరిసాయి; బుగ్గలు ఎరుపుల్ని పులుముకున్నాయి.

'ఉహూఁ, ఆ అదృష్టం నాది సుశీ; ఒక్క నిముషం ఆలస్యమైతే మనిద్దరి జీవితాలూ కలియని దారుల్లో ఏ మలుపుకు తిరిగేవో...' అన్నాను.

సుశీల కిల కిల మంది.

ఆ కిల కిలలో వన్నాయి వాద్యాల శ్రుతి కలిసింది.

**సుశీల :**

సత్యం నేనూ భార్యాభర్తలం మయ్యాం; జీవితం ఓ నవోదయంలా, ఉదయ సంధ్యా రాగంలా, మధురమైన స్వప్నంలా గడిచిపోసాగింది. జీవితానికి ఇంతకంటే మరేం కావాలి! సత్యం కోసం నేను, నాకోసం సత్యం, ...ఎన్నెన్నో ఆశలు, మూగఆశలు, స్వాప్నాల ఆశలు; మనసులతోబాటు శరీరాలు కూడా ఏకమై మధువెచ్చదనంలో యుగమోక్షణంలా కరగి పోసాగింది; జీవితం అనంత వసంతమే అనిపించింది. నాడని మల్లెల్లో మాయని వెన్నెల్లో సువాసనల వెలుగుల్లో విరిసిన పున్నమి రేయి అనిపించింది...

**సత్యం :**

కాని అన్ని రోజులు పున్నమి కాదని అప్పట్లో తెలుసుకోలేకపోయాను. పున్నమి కవతల అమావాస్యలా జీవితంలో వెలుగు తెరల కవతల చీకటి దొంతరాలుంటాయన్న విషయమే గుర్తుకు రాలేదు అప్పట్లో—

పెళ్లయిన కొత్తలో మఖ సంతోషాల కోసం వెనుకా ముందు చూడకుండా డబ్బు ఖర్చు చేశాను. హనీమూన్ పేరుతో విలాస యాత్ర బయలుదేరి దేశమంతా చుట్టి వచ్చాం ఇద్దరం. కాశ్మీర్ ప్రకృతి సౌందర్యాన్ని, అజంతా శిల్పరమణీమణుల అంద

'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా "'ప్రశ్నావళి.' ఆంధ్ర పత్రిక వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుచున్నాము. — సం॥


మీకు సంతానం లేదా?



అనేకమంది, యితర వైద్యవిధానముల చికిత్సలచే, నిరాశచెందిన సోదరీమణులు, మా సలహా సంప్రదింపులచే, దేశములో పలుప్రాంతముల స్త్రీలు, సంతానవతులై పంపిన ప్రశంసా పత్రము లనేకము గలవు. ఉచిత సలహా. వివరములకు:

శ్రీనాగార్జున మూలికా కుటీరం

రైల్వే స్టేషన్ వద్ద – రామాలయం వీధి,
తెనాలి - 2.



బేబీటోన్
గ్రైప్ మిక్శ్చర్




అంతావేసి యేడాదే. ఇంతలోనే ఆరు పళ్లు వచ్చేశాయి. ఎంతో సరదాగా వున్నాడు
ఆరోగ్య సూచకమైన ఆకలి. గాఢ నిద్రపోతాడు
కాని కదుపునొప్పి!
అది తగ్గటం ఎంతో సేపు కాదులెండి.
బేబీటోన్ గ్రైప్ మిక్శ్చర్‌కు ధన్యవాదాలు
స్టాకిస్టు: (ABC) వారి ఉత్పత్తి
అమర్‌శోభ పోస్టు బాక్సు 518, మద్రాసు-3
పోస్టు బాక్సు 16460 బొంబాయి-16


# జీవన సంధ్యాలు

చందాల్ని చూచిన నా కళ్లు నా సుశీలను ఆ సొగసులో నిలిపి వుంచటంకోసం నిరంతరం తహ తహలాడేవి. నాలో రేగిన సౌందర్యపిపాస, సౌందర్యారాధన, సుశీ నారి స్తున్నా వినక అప్పుల తలుపులు తెరిచాయి. వచ్చే జీతంనుంచి వాయిదాలమీద తీర్చ వచ్చనే ధైర్యం...డబ్బుండి ఎందుకూ, అనుభవించలేనపుడు అనే వాదం ... కొద్ది కాలమే అయినా జీవితమంటే అదే మరి... కలగా కరిగినా, అనుభవంగా మిగులుతుం దని ఆశించాను. కాని ఆనందం మూడు నాళ్ళ ముచ్చటైంది. బ్రతుకు అప్పుల సుడిగుండంలో చిక్కుకొని ఉక్కిరి బిక్కిరవసాగింది. మా జంటను చూసి చాలా మందితోబాటు విధి గూడా అసూయపడిం దేమో నాకు జబ్బు చేసింది. డాక్టర్లు బ్రతకనన్నారు; కాని నా సుశి రాత్రింబవళ్లు నిర్విరామంగా సేవలుచేసి నన్ను బ్రతికించు కుంది; కాని బ్రతికి ప్రయోజనం యేంటి?

**సుశీల :**

ఆయన బ్రతకాలి; నాకోసం ఆయన, ఆయనకోసం నేను బ్రతికి తీరాలి; అభిమానాలు, అనురాగాలు పండినపుడు ఎంత కష్టాన్నైనా భరించాలి. ఎంతటి త్యాగానికైనా సిద్ధంగావాలి. సుఖాల వెనుక ఎంత కష్టంవుందో అనుభవిస్తున్న నాకుతెలుసు; దీన్ని జీవితానికే అనుభవ పాఠంగా తీసుకోవాలిగాని మనసు చెదరగొట్టుకుంటే యెలా; నా బాధల్లా వారు నా గూర్చి బాధపడుతున్నారనే...

**సత్యం :**

మరి బాధగాక ఏముంది! సుశీనిగూర్చే నాబాధ. ఈ బాధని తరచిచూస్తే, సొర పాటు చేశానా అనిపిస్తుంది: పెళ్లిచేసుకొని ఆమెకు అన్యాయం చేశానా! వారూ వీరూ ఆమె 'అదృష్టవంతురాలుగాద'న్నట్లు మాటాడబోయారు. నా స్వయంకృతాపరాధానికి సుశీపై అపవాదు వేయటం నేను సహించలేను. నిజం చెప్పాలన్నా నేను దురదృష్టవంతుడ్ని...

**సుశీల :**

ఊహూఁ, ఆ దురదృష్టం నాది; నన్ను పెళ్లి చేసుకునే ఆయన కష్టాల్లో చిక్కుకున్నాడు; నా దురదృష్టమే ఆయన్ని వరించింది. దిగులుతో ఆయన క్రుంగిపోతున్నాడు. ఆయనలో ఆశల్ని చిగురింపజేసి మళ్లీ ఆయన కోలుకునేట్లు చేయటం భార్యనైన నా విధి; అందుకే ఉద్యోగం చేయాలనుకున్నాను. ఆ మాటే చెప్పాను. ఆయన ముఖం వెలవెలా బోయింది. 'తప్పని సరైనప్పుడు తప్పు లేదుగా'అన్నాను.

'అవును, తప్పేముంది, నాకు పోషించే శక్తి లేనప్పుడు...' అంటూ ఆయన నిట్టూర్చాడు.

'అలా ఎందుకనుకోవాలి...' అన్నాను.

'మరో విధంగా అనుకోవటం లేదు సుశీ; భార్య ఉద్యోగం చేస్తుంటే...' అంటూ నసిగాడాయన లోపలి బాధను వెళ్లబెట్టలేక.

'భర్త తింటూ ఇంట్లో కూర్చున్నాడని నలుగురూ అంటారనా; మరి ఆ అనేవాళ్లు ఆపదలో వచ్చి ఆదుకోరేం! ఇటువంటి పిచ్చి పిచ్చి ఊహల్తో మనసు పాడుచేసుకోకండి...సుఖాల్తోబాటు కష్టాల్ని గూడా పంచుకోవటం అర్ధాంగిగా నా విధి, కర్తవ్యం; భర్త జబ్బుపడి మంచంలో వున్నపుడు, ఉద్యోగం చేయలేని స్థితిలో వున్నపుడు భార్య ఉద్యోగం చేయుటం తప్పుగాదు...' అన్నాను.

'తప్పని నేనన్నానా...కా...ని...' అని ఏమో చెప్పబోయాడాయన:

'సందేహాలు మాని పరిస్థితుల్ని గూర్చి తర్కించండి. పాత అప్పులు తీరకొని వున్నాయి; క్రొత్త అప్పులు పుట్టటం లేదు; డబ్బొచ్చే మార్గం లేదు; మీ ఆరోగ్యమా ఇలా వుంది; ఒకరి కెదురుగా ఒకరం కూర్చుంటే పొద్దు గడుస్తుంది గాని ఇల్లు గడవదుగా. కొంతకాలంపాటు నేను ఉద్యోగం చేస్తే ఈ పస్తుల బెడద తప్పుతుంది; పాత అప్పులు తీరకపోయినా క్రొత్త అప్పుల కోసం దేవులాడాల్సిన అవస్థ వుండదు...' అంటూ నచ్చచెప్పటానికి ప్రయత్నించాను.

'అవును, కొన్ని పరిస్థితుల్లో మగవాడు ఆత్మాభిమానాన్ని చంపుకోక తప్పదు...' అన్నాడాయన ముఖం ప్రక్కకు తిప్పుకుని.

ఆ మాటలాయన నన్ను బాధపెట్టటాని కన్నారేమో అనుకున్నాను. కాని ఆయన బాధేమిటో అర్థం చేసుకున్న తర్వాత అది ఆయనపడే బాధగాని నన్ను బాధపెట్టటానికి అన్నమాటలు కావని గ్రహించాను.

'క్షమించండి; మీ ఆత్మాభిమానాన్ని కించ

వరచాలని ఉద్యోగం చేస్తాననటం లేదు... మీకిష్టం లేకపోతే వద్దు, ఉద్యోగం వూసే యెత్తను...' అన్నాను.

**సత్యం :**

సుశీ ఉద్యోగం చేస్తానంటే మొదట నాకు ఆమెపై కోపం వచ్చింది. అవును, చేతగానితనంలో మనిషిలో ఉక్రోషం పొంగుతుంది; తన తప్పును, ఓటమిని ఒప్పుకోవాల్సి వచ్చినపుడు కోపం రేగుతుంది. అది సహజమే మరి. అదే మనిషికీ ఋషికీ గల వ్యత్యాసం. అయితే ఋషులు గూడా అప్పుడప్పుడూ కోపానికి లొంగిపోవటం జరిగింది; మరి మానవ మాత్రుల విషయం...

పరిస్థితుల్ని పునర్విమర్శించుకున్న తర్వాత నాపై నాకే కోపం వచ్చింది. ఆమె చేస్తున్న సేవకు త్యాగానికి నేనివ్వగలదేముంది! వేదనతో నా మనసు మూగబోయింది. సుశీ కాలక్షేపంకోసం ఉద్యోగం చేస్తాననటం లేదు; కష్టాల్లోంచి ఏదో ఓ విధంగా గట్టెక్కటానికి ఆమె ఉద్యోగం చేయటం తప్ప మరి గత్యంతరం లేదు. అటువంటి పరిణామాలకు కారణం నేనేగా మరి! విధి నాకు శిక్ష విధించిందనేకంటే నన్ను నేనే శిక్షించుకోవాల్సిన పరిస్థితి యేర్పడింది. మనసు సరిగాలేక యేమేమో ఆలోచిస్తున్నాను; ఆ ఆలోచనలకు కళ్ళెం వేసి సుశీల మాటల్ని నెమరువేసుకున్నాను. నా సుఖాన్ని కోరి ఆమె ఉద్యోగం చేస్తానంటున్నది; ఆమె సుఖాన్ని కోరి ఔననటం నా కర్తవ్యం...

సుశీల ఉద్యోగంలో చేరింది.

* * *

**సుశీల :**

తీరా ఉద్యోగంలో చేరింతర్వాత ఎందుకు చేరానా అనిపించింది. అంతకాలం ఆయనకు సహవాసంలో గడిపిన నేను ఆయనకు దూరమైపోతున్నట్లనిపించింది. అవును, ఆఫీసుకు, రోజూ మా మధ్య కొద్ది గంటల దూరాన్ని కల్పించింది. ఈ ఉద్యోగం మా ఇద్దరి మనసుల మధ్య శాశ్వతమైన దూరాన్ని కల్పిస్తుందేమో అని నాకెందుకో అనుమానం కలగసాగింది. తగ్గట్టు నాలో తెలియని నిస్త్రాణ ప్రబలసాగింది. పగల్లా ఆఫీసు, ఆఫీసు వదలితే ఇంటి పనులు, వంట... ఆయన సేవ...జీవితానికి విశ్రాంతి లేకుండా పోయింది. కాని నాలో రేగవలసిన విసుగు, చెలరేగవలసిన చిరాకు ఆయనలో ప్రబలటం ఆశ్చర్యంగానే వుంది...

**సత్యం :**

సుశీ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఎందుకో నాకూ తెలీకుండానే నాలో ఓ విధమైన దుగ్ధ, అనూహ్యమైన ఉక్రోషం చెలరేగసాగాయి. ఆమె ఉద్యోగంలో చేరటం వలన జీవితానికి కావలసినవన్నీ గాకపోయినా జీవించి వుండటానికి కావలసినవి సక్రమంగా అమరుతున్నాయి. కాని అంతకు ముందు ఏవీ అమరకపోయినా లేని ఏదో వెలితి నన్ను వేధించసాగింది. సుశీల పూర్వపు సుశీ; మనిషిలో, మాటలో చేసే సేవలో లోపం లేకపోయినా ఏవో మార్పు గోచరించసాగింది. బహుశా అది నాలోని మార్పేమో! పగలు ఒంటిగా ఇంట్లో కూర్చోటం వలన విపరీతమైన ఆలోచనలు చుట్టుముట్టేవి; విసుగు జనించేది: ఈ విసుగు చిరాకుగా మారి, పగలంతా ఆఫీసు పనితో అలసిపోయి వచ్చిన సుశీపైన నిష్కారణంగా విరుచుకు పడేవాణ్ణి; ఆమె కళ్ళనీళ్ళ పర్యంతమయ్యేది. నా తప్పు నేను తెలుసుకుని లోలోపల కుమిలిపోయేవాణ్ణి. సుశీని కౌగిలిలోకి తీసుకుని లాలించేవాణ్ణి...

రోజులు గడిచేకొద్దీ పగలు ఒంటరితనం వలన అసహనం — నాలో వృద్ధిగా సాగింది. అలా బయటకు వెళ్ళి ఫ్రెండ్సును కలుసుకోవటమో, లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తిరగేయటమో చేయకూడదా అని సుశీ సలహా ఇచ్చింది. నిజమే క్లబ్‌లో కొద్దిసేపు గడిపితే పొద్దుపోతోంది. మనసుకు ఊరటా కల్గుతుంది. ఓ రోజు క్లబ్‌కు వెళ్ళాను...

రాజా, శివం, మణి, మూర్తి పేకాడుతున్నారు. వాళ్ళకేం, దిగులు లేని జీవితాలు. పెద్దలు ఆర్జించి ఇచ్చిపోయారు; కష్టపడి సంపాదించాల్సిన అవసరం లేదు; బరువూ బాధ్యతలు లేవు; ఖులాసా జీవితం; దిలాసా బతుకు; ఎక్కడున్నా గడిచిపోతుంది.


నన్ను చూచి ఎన్నాళ్ళకెన్నాళ్ళకంటూ చిరునవ్వులు ఒలికించారు.

'మళ్ళీ మనిషిగా చూడగల్గాంరా...' అన్నాడు మణి, పేకముక్కల్లోంచి తలెత్తకుండానే.

'వాడి భార్య వాణ్ణి మనిషిగా యేంటి మనిషిగానే చేస్తుంది...' అన్నాడు రాజు, ముక్కచిగుతూ...

'ఏరా మాట్లాడవు, మహర్షివయ్యావేంటి...' అంటూ ముక్క అందుకున్నాడు శివం.

'అన్నట్లు మనవాడి సతీమణి ఉద్యోగం చేస్తున్నదట గదూ...' ఏదో కొత్త విషయాన్ని డిస్కవర్ చేసినట్లు అన్నాడు మూర్తి...వాడి భార్యకు ఉద్యోగం చేయా



ల్సిన అవసరంలేదు మరి; ఆమె పుట్టింట్లో వుందో, అత్తగారింట్లో వుందో వాడికే తెలి యదు! నేను గుర్రాలతోబాటు మకాం ఊరూరుకూ మారుస్తూ వుంటుంది; రేసులు లేకపోతే పేకాటతో పొద్దు గడు స్తుంది.

'ఎందరు భార్యలు ఉద్యోగాలు చేయటం లేదు; వేడి నీళ్ళలో చన్నీళ్ళని, ఈ కాలంలో భార్యాభర్తా, ఇద్దరూ ఉద్యోగాలు చేసి గడించకపోతే ఈ మహాపట్నాల్లో గడపటం కష్టమే,' అన్నాడు మూర్తి; అతడికి జీవితం అంటే యేమిటో తెలుసు...

'మనవాడి ఉద్యోగం ఎప్పుడో ఊడిం దిగా' అన్నాడు శివం, వెకిలిగా నవ్వుతూ.

'పీడా వదిలింది; భార్య ఉద్యోగం చేస్తుంటే, మరి ఉద్యోగం దేనికి; ఆరోగ్యం గూడా సరిగా లేదుగా; హాయిగా ఊరూ, వాడా తిరుగుతూ, క్లబ్‌లో కులా సాగా పేకాడుతూ గడపవచ్చు...' అన్నాడు మూర్తి.

వాళ్ళ మాటలకు నాకు నవ్వు వచ్చింది, పిచ్చావూ వచ్చింది; జీవితం అంటే యేంటో తెలియని వీళ్ళా నా స్నేహితులు, అనుకున్నాను. 'అదేంట్రా వెళుతున్నావ్!' అని పిలుస్తున్నా వినిపించుకోకుండా వచ్చేశాను.

ఇంటికి వచ్చానన్నమాటేగాని వాళ్ళ మాటలు నా చెవుల్లో రింగ్‌మంటూనే వున్నాయి. క్లబ్‌కు ఎందుకు వెళ్ళానా అని పించింది. నాపై నాకు కోపం వచ్చింది. ఆ కోపాన్ని ఆఫీసు నుంచి తిరిగొచ్చిన సుశీ మీద చూపాను. ఆమె కిమ్మనలేదు. ఆమె మౌనం నాలో మరింత కసిను రెచ్చగొట్టింది. ఆమె మనసును నొప్పించాను.

**సుశీల :**

ఆయనకు ఎందుకు నామీద కసి! నేనేం లోపం చేశానని! ఆయన విపరీ తంగా(?) మాటీపోటీ మాటలు వింటుంటే తల పగలగొట్టుకొని చచ్చిపోదామా అనిపించేది. ఉద్యోగాలు చేసే భార్యలందరి జీవితాలు ఇంతేనా!

వారికి సుఖమనేది లేదా! ఒక్కోరాత్రి ఆయన మనసును నొప్పిస్తూ అనే మాటలకు నిద్రగూడా పట్టేదిగాదు; నాకు ఇటువంటి శిక్ష ఎందుకు విధించావు దేవుడా అంటూ కుమిలిపోయేదాన్ని; కోరి ఆయన్ను పెళ్ళిచేసుకుని నాకు నేనే శిక్ష విధించుకున్నా ననుకునేదాన్ని. ఓరోజు అర్ధరాత్రి చటుక్కున మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూచాను; ఆయన, గుడ్డలు చిన్న సూట్‌కేసులోకి సర్దుకొని వెళ్ళబోతు న్నాడు.

అర్ధరాత్రి ప్రయాణం ఎక్కడికని అడిగాను పడకమీదనుంచి లేచి వెళ్ళి.

'ఏమో!' అన్నాడాయన...

'మీకు తెలియకుండానే వెళుతున్నారా?' అడిగాను.

'కాళ్ళు ఎక్కడికి తీసుకువెళ్తే అక్క డికి, సుఖంలేక పోయినా శాంతి లభించే తావుకు...' అన్నాడు, జీవితంలో మనః శాంతి కరువైనట్లు.

'ఇక్కడలేని శాంతి ఎక్కడ లభి స్తుంది!' అడిగాను.

'లేని శాంతితో ఆత్మవంచన చేసుకుని బ్రతకటం దుర్లభంగా వుంది...' అన్నా రాయన.


ఆయన ఏం మాట్లాడుతున్నాడో నాకూ అర్థంగాలేదు. అయోమయంతో అమాటే చెప్పాను, గుమ్మానికి అడ్డు నిలుస్తూ...

'నన్ను నేను అర్థం చేసుకోలేని స్థితిలో వున్నాను; గుమ్మానికి అడ్డు తొలుగు...' అంటూ కర్కశ స్వరంతో అన్నారాయన.

'గుమ్మానికి అడ్డుతొలగినా వివాహ బంధమనే శాశ్వతమైన అడ్డు యెలా తొలుగు తుంది!' బాధను దిగమింగి కటువుగా అడిగాను.

ఆయన నివ్వెరపోయారు. అంతలోనే తేరుకుని, 'అంటే ఆ బంధాన్ని గూడా తెంచి వెళ్ళమనా!' అన్నారు నా ముఖంలోకి సూటిగా చూస్తూ.

'ఆ బంధాన్ని తెంచినా అనుబంధం తెగిపోదుగా!' ఎందుకు మీరీవిధంగా మారి పోయారు! నలుగురిలో నవ్వులపాలవుతా మని గూడా లేకుండా ఎందుకు పారిపో దలచారు! కారణం లేకుండా నన్నీవిధంగా ఎందుకు హింసిస్తున్నారు!' ఎంత అణచు కున్నా దుఃఖం ఆగిందికాదు. ఆ దుఃఖంలో అడగాల్సినవన్నీ అడిగాను. 'ఆ బంధాన్ని గూడా తెంచివెళ్ళమనా!' అన్న ఆయన ములుకుల్లాంటి మాటలు నా గుండెల్ని నులిమి వేస్తున్నట్లనిపించింది. ఎందుకో కళ్ళు తిరిగినట్లై తూలి పడబోయాను,



'సుశీ!' అంటూ ఆయన చటుక్కున నన్ను పట్టుకున్నారు.

'ఆనాడు పూలబాసలని, మూగబాసలని చేసిన బాసలు, జబ్బుతో బాధపడుతూ పొందిన సేవలు మరచిపోయారా!' హీన స్వరంతో నన్ను నేను నిలతొక్కుకోటానికి ప్రయత్నిస్తూ.

'నన్నుక్షమించు సుశీ; ఈ తప్పు నీది కాదు నాది...' అన్నారాయన నన్ను మంచంవద్దకు తీసుకువెళ్ళి కూర్చోబెట్టూ.


'అందుకు నాకు ఈ విధంగా శిక్ష విధించదలచారా! మీరు లేనప్పుడు నేనెందుకు! ఉద్యోగం ఎందుకు! ఈ అశాంతి, ఆవేదనకు, అగాధాలకూ నా ఉద్యోగమే కారణమైతే రేపే రాజీనామా ఇస్తాను. మీతోబాటే నేను; మీరెక్కడుంటే అక్కడే నేను...' అన్నాను నా నిశ్చయాన్ని తెలుపుతూ.

'నన్ను క్షమించు సుశీ'. అంటూ ఆయన నా చేతులు పుచ్చుకుని నా ప్రక్కనే కూర్చున్నారు. ఆయన కంఠంలో పశ్చాత్తాపం జీరాడుతున్నది. కన్నుల్లో దైన్యం మిలమిలలాడింది. 'నాకు నీ ఇష్టమొచ్చిన శిక్ష విధించు; లోకానికి వెరచి పిరికిపాడనై పారిపోదలచాను. నీకు తీరని అన్యాయమే సనుకట్టాను. ఆనాడు రైలు స్టేషన్‌లో ఓ క్షణం ఆలస్యమై వుంటే ఇద్దరి జీవితాలు ఏ మలుపులకు తిరిగి వుండేవో తెలియదుగాని ఈనాడు నీకు మెలకువ రావటం ఒక్క క్షణం ఆలస్యమై వుంటే అధఃపతనమే జరిగివుండేదనటం నిజం... ఇక మనిద్దరినీ ఏశక్తీ విడదీయలేదు; ఇప్పుడప్పుడే రాజీనామా ఇవ్వాల్సిన అవసరం లేదు; రేపటినుంచి నేనుగూడా ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నిస్తాను; నాకు ఉద్యోగం దొరికింతర్వాత నువ్వు రాజీనామా ఇవ్వచ్చు ...' అన్నారాయన నన్ను దగ్గరకు తీసుకుంటూ.

అబ్బ, తుపాను వెలసింది...

ప్రళయానంతరం ప్రశాంతి అన్నారు... కాదు, జీవితం క్రొత్త మలుపులకు మళ్ళింది. ●

(అయిపోయింది)


ఉత్సాహవంతులుకండి... లాలిత్యం పొందండి...,
రోజంతా శోభ చేకూర్చుకోండి !

మీకు రోజంతా శోభ చేకూర్చుటలో సహాయపడే చార్మిస్ టాల్కాతో, చల్లగా సేదదేరి ఉండండి. చార్మిస్ యొక్క ఆనందప్రదమైన పరిమళం మిమ్మల్ని సేదదేర్చుటలో ఇంద్ర జాలములా పని చేస్తుంది... మిమ్మల్ని ఉత్సాహవంతుల్ని చేస్తుంది. శోభాయమానమైన లావణ్యం మీకు చేకూర్చుతుంది.




చార్మిస్
టాల్కమ్ పౌడరు
ఆనందప్రదమైన
వాసన కలిగి యున్నది